# హైదరాబాద్ ఓటమి

**ఉత్తరాఖండ్‌తో రంజీ పోరు**

డెహ్రాడూన్: రంజీ టోర్నీలో హైదరాబాద్ వరుస ఓటముల పరంపర కొనసాగుతున్నది. తమ తొలి మ్యాచ్‌లో గుజరాత్ చేతిలో కంగు తిన్న హైదరాబాద్..తాజాగా ఉత్తరాఖండ్‌పై ఓటమి పాలైంది. సోమవారంతో ముగిసిన మ్యాచ్‌లో హైదరాబాద్ 78 పరుగుల తేడాతో పరాజయం చవిచూసింది. ఉత్తరాఖండ్ నిర్దేశించిన 269 పరుగుల లక్ష్యఛేదనలో హైదరాబాద్ 190 పరుగులకు కుప్పకూలింది. స్వప్నిల్‌సింగ్ (6/59) ధాటికి హైదరాబాద్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. రోహిత్‌రాయుడు(47 నాటౌట్), తన్మయ్ అగర్వాల్ (38), అభిరాత్‌రెడ్డి (35) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. స్వప్నిల్ స్పిన్ విజృంభణతో మన బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 189/5తో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఉత్తరాఖండ్ 235 పరుగులు చేసింది. మిలింద్ (3/31), తనయ్ త్యాగరాజన్ (2/62), రోహిత్‌రాయుడు (2/27) రాణించారు.

# దీపిక వెండి వెలుగులు



• **ఆర్చరీ ప్రపంచకప్ ఫైనల్**

టాలస్కల(మెక్సికో): ప్రతిష్ఠాత్మక ఆర్చరీ ప్రపంచకప్‌లో భారత స్టార్ ప్లేయర్ దీపికా కుమారి రజత పతకంతో మెరిసింది. మూడేండ్ల తర్వాత ప్రపంచకప్ ఫైనల్లో పోటీకి దిగిన దీపిక అద్భుత ప్రదర్శన కనబరిచింది. సోమవారం జరిగిన మహిళల రికర్వ్ ఫైనల్లో దీపిక 0-6తో లీ జియామన్(చైనా) చేతిలో ఓడి రెండో స్థానంలో నిలిచింది. రెండో సీడ్‌గా పోటీకి దిగిన దీపికకు ఓవరాల్‌గా ప్రపంచకప్‌లో ఇది ఐదో రజత పతకం కావడం విశేషం. మరోవైపు పురుషుల రికర్వ్ విభాగంలో యువ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ ఆదిలో దూకుడు కనబరిచినా 4-6 తేడాతో కొరియా ఆర్చర్ లీ వూ సీయోక్ చేతిలో ఓడి నిష్క్రమించాడు. దీంతో ఐదుగురు ఆర్చర్లతో బరిలోకి దిగిన భారత్..ఒక్క పతకంతో తమ పోరాటాన్ని ముగించింది.

## దేశవాళీతో సిద్ధమవుతా: షమీ



గురుగ్రామ్: ప్రస్తుతం గాయం నుంచి పూర్తిగా కోలుకున్నానని, దేశవాళీ టోర్నీ రంజీల్లో ఆడి ఫిట్‌నెస్ నిరూపించుకోవడం ద్వారా ఆస్ట్రేలియా సిరీస్ సిద్ధమవుతానని భారత సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ పేర్కొన్నాడు. గాయం కారణంగా గత నవంబర్ నుంచి జట్టుకు దూరమైన షమీ..నెట్స్‌లో సుదీర్ఘంగా బౌలింగ్ చేశాడు. తన సన్నద్ధతపై షమీ మీడియాతో స్పందిస్తూ 'ఎలాంటి నొప్పి లేకుండా బౌలింగ్ చేయడంపై సంతోషంగా ఉన్నాను. ఒత్తిడి బాగా పడకుండా హాఫ్ రనప్‌తో ప్రాక్టీస్ చేస్తున్నాను. కానీ ఆదివాం పూర్తి రనప్‌తో వంద శాతం బౌలింగ్ చేసేందుకు ప్రయత్నించాను. చాలా మంది ఆసీస్‌తో టెస్టు సిరీస్‌లో ఆడుతాడా లేదా అన్న దానిపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. సిరీస్ మొదలు కావడానికి చాలా సమయం ఉంది. ఆలోగా దేశవాళీ ఒకటి, రెండు మ్యాచ్‌లు ఆడటం ద్వారా మ్యాచ్ ఫిట్‌నెస్ సాధిస్తానన్న నమ్మకముంది' అని అన్నాడు.

# పాలమూరులో టర్ఫ్ వికెట్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: భవిష్యత్‌లో రంజీ మ్యాచ్‌లు నిర్వహించేలా మహబూబ్‌నగర్ స్టేడియాన్ని తీర్చిదిద్దుతామని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. సోమవారం పాలమూరు స్టేడియంలో టర్ఫ్ వికెట్ నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. గ్రామీణ క్రికెట్‌ను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో 80లక్షల వ్యయంతో టర్ఫ్ వికెట్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. శంషాబాద్ నుంచి మహబూబ్‌నగర్ స్టేడియం సమీపంలో ఉండటంతో భవిష్యత్‌లో రంజీ మ్యాచ్‌లు నిర్వహించేందుకు ఆస్కారముందని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏ కార్యవర్గ సభ్యులు దేవరాజ్, బసవరాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



*దుబాయ్‌లోని ప్రముఖ టూరిజం ప్రాంతంగా పేరొందిన జెయింట్ వీల్ దగ్గర టీ20 ప్రపంచకప్ ట్రోఫీతో ఫోజిచ్చిన న్యూజిలాండ్ కెప్టెన్ సోఫీ డివైన్. ఆదివారం జరిగిన ఫైనల్లో దక్షిణాఫ్రికాపై భారీ విజయంతో కివీస్ తొలిసారి ప్రపంచకప్ టైటిల్‌ను సొంతం చేసుకుంది.*

# తైజుల్ పాంచ్ పటాకా

**దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 140/6**

మిర్పూర్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో పర్యాటక దక్షిణాఫ్రికా చిక్కుల్లో పడింది. లెఫ్టార్మ్ స్పిన్నర్ తైజుల్ ఇస్లాం (5/49) ధాటికి దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 140 పరుగులకు 6 వికెట్లు కోల్పోయింది. పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ తైజుల్ తిప్పేయడంతో సఫారీ బ్యాటర్లు వరుస విరామాల్లో వికెట్లు సమర్పించుకున్నారు. 9 పరుగుల వద్ద కెప్టెన్ మార్క్‌రమ్ (6) వికెట్ కోల్పోయిన దక్షిణాఫ్రికా..తైజుల్ స్పిన్ ధాటికి కంగుతిన్నది. టోనీ డీ జోర్జి(30), రికల్టన్ (27) ఆకట్టుకోగా, స్టబ్స్(23), బెడింగ్‌హామ్ (11), బ్రిట్జ్కె (0) విఫలమయ్యారు. షకీబల్‌హసన్ తర్వాత టెస్టుల్లో 200 వికెట్లు తీసిన రెండో బంగ్లా బౌలర్‌గా తైజుల్ నిలిచాడు. అంతకుముందు బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 106 పరుగులకే కుప్పకూలింది. రబాడ (3/26), ముల్డర్ (3/22), మహారాజ్ (3/34) మూడేసి వికెట్లతో రాణించారు.

# సెమీస్‌లో యువ భారత్

**యూఏఈపై ఘన విజయం • రాణించిన రసిక్, అభిషేక్ • ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్**



అల్ అమెరాత్(ఒమన్): భారత కుర్రాళ్లు దుమ్మురేపుతున్నారు. అవకాశాన్ని అందిపుచ్చుకుంటూ అదరగొడుతున్నారు. ఏసీసీ మెన్స్ టీ20 ఎమర్జింగ్ ఆసియాకప్‌లో యువ భారత్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. తమ తొలి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ భరతం పట్టిన భారత్..మలి మ్యాచ్‌లో యూఏఈని చిత్తు చేసింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో తిలక్‌వర్మ సారథ్యంలోని టీమ్ ఇండియా 7 వికెట్ల తేడాతో యూఏఈపై విజయదుందుభి మోగించింది. తద్వారా వరుసగా రెండు విజయాలతో గ్రూపు-బిలో నాలుగు పాయింట్లతో సెమీస్ బెర్తు ఖరారు చేసుకుంది. మ్యాచ్ విషయానికొస్తే..తొలుత రసిక్ సలామ్(3/15), రమణ్‌దీప్ సింగ్(2/7) ధాటికి యూఏఈ 16.5 ఓవర్లలో 107 పరుగులకు ఆలౌటైంది. రాహుల్ చోప్రా(50) అర్ధసెంచరీతో ఆకట్టుకోగా, మిగతావారు సింగిల్ డిజిట్ స్కోర్లకు పరిమితమయ్యారు. భారత యువ బౌలర్ల ధాటికి యూఏఈలో ఎనిమిది మంది బ్యాటర్లు రెండెంకల స్కోరు అందుకోలేకపోయారు. పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ బౌలర్లు చెలరేగడంతో యూఈఏ బ్యాటర్లు చేష్టలుడిగిపోయారు. ముఖ్యంగా రసిక్ సలామ్ స్వింగ్ బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. బంతిని ఇరువైపులా స్వింగ్ చేస్తూ ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. మూడు వికెట్లతో రాణించిన రసిక్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత్..బుధవారం ఒమన్‌తో తలపడుతుంది.

**ఆడుతూ పాడుతూ:**

స్వల్ప లక్ష్యాన్ని యువ భారత్ టీమ్ ఆడుతూ పాడుతూ ఛేదించింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(8) నిరాశపరిచినా..అభిషేక్‌శర్మ(24 బంతుల్లో 58, 6ఫోర్లు, 4సిక్స్‌లు), కెప్టెన్ తిలక్‌వర్మ(18 బంతుల్లో 21, 2ఫోర్లు, సిక్స్) లక్ష్యం వైపు సాఫీగా సాగారు. ఈ మధ్య ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్న అభిషేక్ సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. తన ఇన్నింగ్స్‌లో 6 ఫోర్లు, నాలుగు భారీ సిక్స్‌లతో చెలరేగాడు. సుకుమారన్ బౌలింగ్‌లో తిలక్ ఔట్ కావడంతో రెండో వికెట్‌కు 73 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. తిలక్‌ను అనుసరిస్తూ అభిషేక్ పెవిలియన్ చేరినా..నేహాల్ వధేరా(6 నాటౌట్), ఆయుశ్ బదోని(12 నాటౌట్) 10.5 ఓవర్లలో గెలుపు లాంఛనాన్ని పూర్తి చేశారు. షఫీ రెహమాన్, ఫారుఖ్, సుకుమారన్ ఒక్కో వికెట్ తీశారు.

**సంక్షిప్త స్కోర్లు**

**యూఏఈ:** 16.5 ఓవర్లలో 107 ఆలౌట్(రాహుల్ 50, హమీద్ 22, రసిక్ 3/15, రమణ్‌దీప్ 2/7), **భారత్ 'ఎ':** 10.5 ఓవర్లలో 111/3(అభిషేక్ 58, తిలక్ 21, సుకుమారన్ 1/10, ఫారుఖ్ 1/16)

## ఇషాన్‌కిషన్ రీ ఎంట్రీ

**భారత 'ఎ' జట్టులో చోటు**

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా పర్యటన కోసం ఎంపిక చేసిన భారత 'ఎ' జట్టులో వికెట్‌కీపర్, బ్యాటర్ ఇషాన్‌కిషన్ చోటు దక్కించుకున్నాడు. రంజీ ట్రోఫీలో ముంబైపై సెంచరీ ద్వారా ఇషాన్ తిరిగి ఫామ్‌లోకి వచ్చాడు. సోమవారం 15 మందితో ప్రకటించిన జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్‌గా, అభిమన్యు ఈశ్వరన్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీకి ముందు భారత 'ఎ' జట్టు ఆస్ట్రేలియా 'ఎ'తో రెండు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడనుంది. ఆ తర్వాత భారత సీనియర్ జట్టుతో కలిసి మూడు రోజుల మ్యాచ్‌లో తలపడనుంది. భారత 'ఎ' జట్టులో దేశవాళీల్లో నిలకడగా రాణిస్తున్న సాయి సుదర్శన్, నితీశ్‌కుమార్‌రెడ్డి, దేవదత్ పడిక్కల్, రికీ భుయ్, యశ్ దయాల్ లాంటి క్రికెటర్లకు చోటు కల్పించారు.

## టీ20 ప్రపంచకప్ జట్టులో హర్మన్‌ప్రీత్

దుబాయ్: మహిళల టీ20 ప్రపంచకప్ టోర్నీ టీమ్‌లో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్ చోటు దక్కించుకుంది. మెగాటోర్నీలో సత్తాచాటిన ప్లేయర్ల సమాహారంతో ఐసీసీ జట్టును ఎంపిక చేసింది. టీమ్‌ఇండియా లీగ్ దశలోనే నిష్క్రమించగా, హర్మన్‌ప్రీత్‌కౌర్ మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఆస్ట్రేలియాతో ఆఖరి లీగ్ మ్యాచ్‌లో అర్ధసెంచరీతో జట్టును గెలిపించేందుకు కడదాకా ప్రయత్నం చేసింది. తొలిసారి టీ20 ప్రపంచకప్ గెలిచిన న్యూజిలాండ్ నుంచి అమెలియా కెర్, రోసిమేరీ, ఎడ్సన్ కార్సన్ జట్టులో చోటు దక్కించుకున్నారు.

**టీ20 ప్రపంచకప్ టీమ్:**

లారా వోల్వార్డ్(కెప్టెన్), బ్రిట్స్, డానీ వ్యాట్, అమెలియా కెర్, హర్మన్‌ప్రీత్ కౌర్, దియోంద్ర డాటిన్, నిగార్ సుల్తానా, ఫ్లెచర్, రోసిమేరీ, మాల్బా, మేగన్ స్కట్, ఎడెన్ కార్సన్.

చిత్రం

# బుజ్జమ్మ అని పిలుస్తారు!



'కెరీర్ తొలినాళ్లలో లవ్‌స్టోరీస్ చేయాలనుకున్నా. అయితే 'మల్లేశం' సినిమా తర్వాత అలాంటి మెచ్యూర్డ్ క్యారెక్టర్స్‌లో ప్రేక్షకులు నన్ను చూడాలనుకుంటున్నారు. ఈ విషయంలో చాలా ఆనందంగా ఉంది' అని చెప్పింది అనన్య నాగళ్ల. ఆమె కథానాయికగా నటించిన తాజా చిత్రం 'పొట్టేల్' ఈ నెల 25న ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా సోమవారం అనన్య నాగళ్ల పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'ఈ సినిమాలో బుజ్జమ్మ అనే మదర్ క్యారెక్టర్‌లో కనిపిస్తా. కథలో నా పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. ఈ సినిమా తర్వాత నన్ను బుజ్జమ్మ అని పిలుస్తారేమో (నవ్వుతూ). దర్శకుడు సాహిత్ నా పాత్రను చాలా గొప్పగా తీర్చిదిద్దాడు' అని చెప్పింది. కథానుగుణంగానే 'పొట్టేల్' అనే టైటిల్ పెట్టారని, పొట్టేల్ తన దారిలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఢీకొట్టి వెళ్తుందని, అదే స్వభావంతో సినిమాలో హీరో క్యారెక్టర్ కనిపిస్తుందని ఆమె తెలిపింది. తెలంగాణ సంస్కృతి, సామాజిక సందేశం అద్భుతంగా కలబోసిన కథాంశమిదని, చాలా సన్నివేశాలు కన్నీళ్లు తెప్పిస్తాయని అనన్య పేర్కొంది. కెరీర్ గురించి మాట్లాడుతూ 'మంచి అవకాశాలు వస్తున్నాయి. పర్‌ఫార్మెన్స్ ఓరియెంటెడ్ రోల్స్ కోసం ఇండస్ట్రీలో ఉన్న ఇద్దరుముగ్గురు తెలుగమ్మాయిల్లో నా పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నది. అందుకే 'పొట్టేల్'లాంటి ఎమోషనల్ సినిమాలో ఛాన్సొచ్చింది' అని చెప్పింది.



# డబ్బు ఇచ్చే కిక్కే వేరు

**దుల్కర్ సల్మాన్** కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. మీనాక్షి చౌదరి కథానాయిక. దీపావళి సందర్భంగా ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. 1980-90దశకంలో బ్యాకింగ్ సెక్టార్ నేపథ్య కథాంశమిది. డబ్బు కోసం ఎత్తుకుపై ఎత్తులు వేస్తూ ఎంతటి రిస్క్ చేయడానికైనా సిద్ధపడే భాస్కర్ పాత్రలో దుల్కర్ సల్మాన్ ట్రైలర్‌లో కనిపించారు. ధనవంతుడు కావాలనే ఆయన సంకల్పం, ఈ క్రమంలో ఆయన చేసే ప్రయత్నాల నేపథ్యంలో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. 'సిగరెట్, ఆల్కహాల్, డ్రగ్స్ కంటే డబ్బిచ్చే కిక్కే వేరు' అంటూ ట్రైలర్ చివరిలో దుల్కర్ సల్మాన్ చెప్పిన డైలాగ్ అతని మనస్తత్వానికి అద్దం పట్టేలా ఉంది. ఈ సందర్భంగా దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ...ఈ సినిమా తనకెంతో ప్రత్యేకమని, చక్కటి హాస్యంతో పాటు ఎమోషనల్ డ్రామాగా ఆకట్టుకుంటుందని, ఫ్యామిలీ ఆడియెన్స్ మెచ్చే అంశాలుంటాయని చెప్పారు. ప్రతి సన్నివేశం కొత్తగా ఉంటుందని నిర్మాత సూర్యదేవర నాగవంశీ అన్నారు. ఈ సినిమాలో తాను సుమతి పాత్రలో కనిపిస్తానని, ఇప్పటివరకు చేసిన క్యారెక్టర్స్‌లో ఇదే బెస్ట్ అని కథానాయిక మీనాక్షి చౌదరి పేర్కొంది.

# రాజాసాబ్ బర్త్‌డే బొనాంజా




**ప్రభాస్** కథానాయకుడిగా నటిస్తున్న హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'రాజాసాబ్' కోసం ఆయన అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఏప్రిల్ 10న పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకురానుంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రభాస్ ఇప్పటివరకు చేయని రొమాంటిక్, హారర్ జోనర్ కావడంతో ఈ సినిమాపై అందరిలో ఆసక్తినెలకొని ఉంది. కొద్ది మాసాల క్రితం విడుదల చేసి గ్లింప్స్ సినిమాపై మరింత అంచనాలను పెంచింది. ఈ నెల 23న ప్రభాస్ పుట్టినరోజుని పురస్కరించుకొని సినిమాకు సంబంధించిన ఇంట్రెస్టింగ్ అప్‌డేట్‌ను వెల్లడించనున్నారు. ఈ సందర్భంగా సోమవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ప్రభాస్ అల్ట్రా స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ ఇంతకుముందెప్పుడూ చూడని రొమాంటిక్ అవతారంలో కనిపిస్తారని, అభిమానులకు పండగలా దర్శకుడు మారుతి ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నాడని మేకర్స్ తెలిపారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవన్, రచన-దర్శకత్వం: మారుతి.

# మాస్క్ మ్యాన్ 'బఘీర'



**'కేజీఎఫ్' ఫేమ్** దర్శకుడు ప్రశాంత్‌నీల్ కథనందించిన చిత్రం 'బఘీర'. శ్రీమురళి హీరోగా నటించిన ఈ చిత్రానికి సూరి దర్శకుడు. హోంబలే ఫిల్మ్స్ నిర్మించింది. ఈ నెల 31న విడుదలకానుంది. సోమవారం థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. దేవుడి అవతారాల గురించి తల్లి, కొడుకు మధ్య సంభాషణతో ట్రైలర్ ఆసక్తికరంగా మొదలైంది. అరాచకాలను అంతం చేయడానికి దేవుడు అనేక రూపాల్లో వస్తాడని, రాక్షసుడిగా కూడా రావొచ్చని తల్లి చెబుతుంటుంది. అనంతరం నేరస్థులను మట్టుబెడుతున్న మాస్క్ మ్యాన్ బఘీర కోసం పోలీసుల వేటతో ట్రైలర్ ఉత్కంఠను పంచింది. శ్రీమురళి పోలీస్ అధికారిగా, మాస్క్ మ్యాన్‌గా డిఫరెంట్ షేడ్స్‌తో కూడిన పాత్రలో కనిపించారు. రుక్మిణి వసంత్, ప్రకాష్‌రాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: డాక్టర్ సూరి.

# జగిత్యాల నేపథ్యంలో..



**రాకేష్** వర్రే టైటిల్ రోల్‌ని పోషిస్తున్న చిత్రం 'జితేందర్ రెడ్డి'. విరించివర్మ దర్శకుడు. ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మాత. నవంబర్ 8న ప్రేక్షకుల ముందుకురానుంది. '1980 దశకంలో జగిత్యాల ప్రాంతంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. కాలేజీ రోజుల నుంచి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, నక్సలైట్లతో జితేందర్ రెడ్డి చేసిన పోరాటాన్ని సినిమాలో ఆవిష్కరించాం. ఆయన రాజకీయప్రస్థానం ఎలా సాగిందన్నది సినిమాలో ఆసక్తికంగా ఉంటుంది' అని చిత్రబృందం పేర్కొంది. ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నదని, సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నామని నిర్మాత తెలిపారు. వైశాలిరాజ్, రియా సుమన్, ఛత్రపతి శేఖర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: గోపీసుందర్, దర్శకుడు: విరించి వర్మ.

# క్రైమ్ కామెడీ 'తస్కరించుట'

సన్నీ హీరోగా పరిచయమవుతున్న 'తస్కరించుట' చిత్రం సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. శివప్రసాద్ చలువాది దర్శకుడు. రెచెల్ పిక్చర్స్ పతాకంపై షేక్‌అఫ్రీన్ నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత బెల్లంకొండ సురేష్ క్లాప్‌నివ్వగా, యువ హీరో ఆకాష్ పూరి కెమెరా స్విఛాన్ చేశారు. క్రైమ్ కామెడీ థ్రిల్లర్ కథాంశమిదని, ప్రజెంటేషన్ సరికొత్తగా ఉంటుందని, మరిన్ని వివరాలను త్వరలో వెల్లడిస్తామని దర్శకుడు తెలిపారు. వచ్చే నెల 15వ తేదీ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని నిర్మాత పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: అజయ్ ఎర్రగుంట్ల, సంగీతం: రోహిత్, కథ, స్క్రీన్‌ప్లే: పండు చరణ్, దర్శకత్వం: శివప్రసాద్ చలువాది.





# శ్రద్ధాకపూర్ టాలీవుడ్ ఎంట్రీ

**బాలీవుడ్** అగ్ర కథానాయిక శ్రద్ధాకపూర్ తెలుగు చిత్రసీమలో అరంగేట్రానికి రంగం సిద్ధమైందని సమాచారం. వివరాల్లోకి వెళితే.. నానితో 'దసరా'వంటి బ్లాక్ బస్టర్ చిత్రాన్ని అందించాడు యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల. వీరిద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. సుధాకర్ చెరుకూరి నిర్మాత. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో శ్రద్ధాకపూర్‌ను కథానాయికగా ఖరారు చేయబోతున్నారని తెలిసింది. ఇప్పటికే ఆమెతో చిత్ర బృందం సంప్రదింపులు జరిపిందని, కథలోని కొత్తదనం నచ్చడంతో శ్రద్ధాకపూర్ ఈ సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని అంటున్నారు. ఎప్పటి నుంచో దక్షిణాది అరంగేట్రం కోసం ఎదురుచూస్తున్నది శ్రద్ధాకపూర్. ఈ నేపథ్యంలో నాని చిత్రం ద్వారా ఆమె టాలీవుడ్‌లో ఎంట్రీ ఇవ్వబోతుండటం విశేషం. ఈ విషయంలో చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# లేడీ పోలీస్ పోరాటం



**లక్ష్మీరాయ్** ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. గురుప్రసాద్ దర్శకుడు. కన్నడ, తమిళ భాషల్లో మంచి విజయాన్ని సాధించిన ఈ చిత్రాన్ని ఆర్కే ఫిలిమ్స్ పతాకంపై ప్రతాని రామకృష్ణ గౌడ్ తెలుగులో విడుదల చేస్తున్నారు. సోమవారం ట్రైలర్‌ను సీనియర్ నటుడు సుమన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన..ఈ సినిమాలో లక్ష్మీరాయ్ ఫైట్స్‌తో అదరగొట్టిందని అన్నారు. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ 'లక్ష్మీరాయ్ త్రిపాత్రాభినయం ప్రధానాకర్షణగా నిలుస్తుంది. సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై లేడీ ఐపీఎస్ ఆఫీసర్ చేసిన పోరాటం ఆకట్టుకుంటుంది. డ్రగ్స్ ముఠాలు, గ్రామాల్లో రౌడీల ఆగడాలకు అడ్డుకట్టవేసే పవర్‌ఫుల్ పోలీస్‌గా లక్ష్మీరాయ్ పాత్ర సాగుతుంది. నవంబర్ రెండోవారంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు.



# శ్రీచక్రం ప్రేరణగా..

**రాకేష్,** స్రవంతి పత్తిపాటి, మానసవీణ, భార్గవ్ గోపీనాథం ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రహస్యం ఇదం జగత్'. కోమల్ ఆర్ భరద్వాజ్ దర్శకుడు. పద్మ రావినూతుల, హిరణ్య నిర్మాతలు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ...అమెరికాలోని డల్లాస్‌లో విడుదల చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తున్నదని, సైన్స్ ఫిక్షన్‌కు పౌరాణిక అంశాలను మేళవించి ఈ సినిమాను తెరకెక్కించామని, శ్రీచక్రం పేరణతో కథ రాశానని చెప్పారు. షూటింగ్ మొత్తం అమెరికాలోనే జరిపామని, మన పురాణాల గురించి సరికొత్త విషయాలను చెప్పబోతున్నామని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి గ్యాని సంగీతాన్నందిస్తున్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.